AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
6-12-2025 (Saturday)
MAIN EDITION

## డొనాల్డ్ ట్రంప్‌నకు ‘ఫిఫా శాంతి బహుమతి’



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఫిఫా శాంతి బహుమతి ప్రకటించింది. 2026లో జరగనున్న ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు సంబంధించి వాషింగ్టన్ డీసీలోని కెన్నడీ సెంటర్‌లో డ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు ‘ఫిఫా శాంతి బహుమతి’ని ప్రకటిస్తున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ప్రకటించారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



**అక్షరటుడే, ఢిల్లీ:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో గల రోళ్లవాగు ప్రాజెక్టుకు సంబంధించి అనుమతుల విషయంలో వేగవంతం చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనుమతుల విషయంలో చొరవ తీసుకోవాలని ఎంపీ అర్వింద్‌ను ఇటీవల జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఎంపీ కలిసి విన్నవించారు.

## గంజాయి నిర్మూలనపై సమీక్ష



**అక్షరటుడే, అమరావతి: గంజాయి నిర్మూలనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్లుగా అటవీ ఉత్పత్తులపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యాన పంటలను ఉపాధి హామీతో అనుసంధానం చేయాలన్నారు.**

## పాట్నాలో టీటీడీ ఆలయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్: బీహార్ రాజధాని పాట్నాలో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆలయం కోసం 10.11 ఎకరాల భూమి కేటాయించింది. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్ లేఖ రాశారు. దీనిపై బీఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.**

## గుమ్మడి నర్సయ్య షూటింగ్ షురూ



**అక్షరటుడే, భద్రాచలం: ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమా తీస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శనివారం షూటింగ్ ప్రారంభించారు. ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ నటిస్తున్నారు. షూటింగ్ ప్రారంభోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.**

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**అక్షరటుడే, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి గొర్లపల్లి రాజ్ కుమార్ ఏసీబీకి చిక్కాడు. గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయిన మేరకు బిల్లు కోసం ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తే లబ్ధిదారుకు రూ.1.40 లక్షల బిల్లు వస్తుంది. దీనికోసం పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ రూ.10 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితులు బతిమిలాడడంతో రూ.5 వేలకు ఒప్పుకున్నాడు. అనంతరం మహిళ భర్త ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శిని పట్టుకున్నారు. అతడిపై కేసు

## విమానాలకు బాంబు బెదిరింపులు

**అక్షరటుడే, హైదరాబాద్:** విమానాలకు బాంబు బెదిరింపులకు ఆగడం లేదు. తాజాగా శంషాబాద్ వస్తున్న మరో రెండు విమానాలకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. కువైట్ నుంచి శంషాబాద్ వస్తున్న ఫ్లైట్‌కు బెదిరింపు మెయిల్ రావడంతో అత్యవసరంగా మస్కట్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. లండన్ నుంచి శంషాబాద్ వస్తున్న బ్రిటీష్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. దీనిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సేఫ్‌గా ల్యాండ్ చేశారు. అధికారులు ఆయా విమానాల్లో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేకపోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇలాంటి బెదిరింపులతో ప్రయాణికులతో పాటు, అధికారుల సమయం వృథా అవుతోంది.




# సంక్షోభంలో ఇండిగో

**ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం కొనసాగుతోంది. వరుసగా ఐదో రోజు వందలాది విమానాలను సిబ్బంది రద్దు చేశారు. శుక్రవారం వెయ్యికి పైగా ఫ్లైట్లు రద్దు అయిన విషయం తెలిసిందే. శనివారం సైతం చాలా విమానాలను క్యాన్సిల్ చేశారు. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాల నుంచి బయల్దేరాల్సిన ఫ్లైట్లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి విమానాశ్రయాల్లో అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లోనే పడిగాపులు కాస్తున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **ఎగరని సంస్థ విమానాలు**
- **ఐదో రోజు వందలాది ఫ్లైట్లు రద్దు**
- **తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**
- **ఎయిర్‌పోర్టుల్లో పడిగాపులు**

దేశీయ విమానయాన రంగంలో ఇండిగో వాటా 60 శాతం ఉండగా, ఆ ప్రభావం ప్రయాణికుల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సిబ్బంది కొరత, డీజీసీఏ కఠిన నిబంధనలు, ప్రతికూల పరిస్థితుల కారణంగా ఇండిగో తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. తన 20 సంవత్సరాల చరిత్రలో ఇండిగో ఎయిర్‌లైన్స్ అత్యంత దారుణమైన కార్యాచరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలోనే ఆ సంస్థ ఐదు రోజులుగా విమాన సర్వీసులను రద్దు చేస్తూ వస్తోంది. ఇండిగో సర్వీసుల రద్దు కారణంగా విమానాల టికెట్ల ధరలు రెట్టింపయ్యాయి. ఇండిగో విమానాలు అందుబాటులో లేకుండా పోవడంతో ఇతర ఎయిర్‌లైన్స్ టికెట్ రేట్లను పెంచాయి.

### కేంద్రం ఆగ్రహం

విమాన టికెట్ ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇండిగో సంక్షోభాన్ని ఆసరాగా తీసుకొని ఛార్జీల పెంచడంపై మండిపడింది. ఇండిగో సర్వీసులు రద్దయిన రూట్లలో టికెట్ ధరలను ఖరారు చేసింది. కొత్త ఛార్జీలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేవరకు ఈ రేట్లు అమలు చేయాలని పేర్కొంది. ప్రయాణికులపై అదనపు భారం మోపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

### రైళ్లలో కోచ్‌ల పెంపు

రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడుతున్న డొమెస్టిక్ ప్రయాణికుల కోసం రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 37 ప్రీమియం రైళ్లలో 116 కోచ్‌లు పెంచింది. 18 రైళ్లలో ప్రయాణికుల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. విమానాల రద్దుల నేపథ్యంలో అత్యవసర సామర్థ్యాన్ని పెంచడంలో భాగంగా భారత రైల్వే 37 రైళ్లకు 116 అదనపు కోచ్‌లను జత చేసిందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. రద్దీని తగ్గించడానికి, రైలు ప్రయాణానికి మారుతున్న చిక్కుకుపోయిన ప్రయాణీకులకు వసతి కల్పించడానికి అదనపు కోచ్‌లు 114 ట్రిప్పులలో నడుస్తాయని పేర్కొంది.

### రీఫండ్ చేయాలి

విమానాలు రద్దయిన ప్రయాణికులకు 100శాతం టికెట్ ధరలను రీఫండ్ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఎటువంటి షరతులు, అదనపు ఛార్జీలు లేకుండా రీషెడ్యూల్ చేసుకోవడానికి అనుమతించాలని పేర్కొంది. ఆదివారం రాత్రి 8 గంటలలోపు రీఫండ్ పూర్తి చేయాలని ఆదేశించింది. డబ్బులు వాపస్ చేయడంతో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## హైదరాబాద్‌లో ఆపరేషన్ కవచ్..



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** నగరంలో ఇటీవల నేరాలు పెరిగాయి. చోరీలు, దాడులు, హత్యలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. గంజాయి, డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో నగర పోలీసులు నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలో సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పది గంటల తర్వాత ఆపరేషన్ కవచ్ నిర్వహించారు. శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసే దిశగా.. నగరవ్యాప్తంగా విస్తృతమైన నాకాబందీని నిర్వహించినట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని రీతిలో దాదాపు 5,000 మంది పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్ విభాగాలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు పాల్గొన్నాయి.

## ఇండిగో సమస్యపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఇండిగో ఎయిర్‌లైన్ సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కేంద్రం నూతనంగా తెచ్చిన కార్మిక చట్టాలపై ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. అధికారం ఒకరిద్దరి చేతిలో ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఇండిగో సంక్షోభం నిదర్శనమన్నారు. ఐదు రోజుల నుంచి ఎయిర్‌పోర్టులు అన్ని రైల్వే స్టేషన్‌లు, బస్ స్టేషన్ల కంటే అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. శ్రమ దోపిడీ చేయొద్దు, పైలట్ వారానికి ఇంత సమయం మాత్రమే నడపాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సంవత్సరం కింద ఒక రూల్ తెచ్చిందన్నారు. కేంద్రం నిబంధన తెచ్చినా ఇండిగో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. దీంతో శుక్రవారం ఒక్క రోజు వెయ్యి విమానాలు రద్దు అయ్యాయని చెప్పారు. ఇండిగో దెబ్బకు కేంద్ర మంత్రిత్వ శాఖ పెట్టిన రూల్‌ను వాళ్లే వెనక్కి తీసుకున్నారని చెప్పారు. ఇండిగో వెనక్కి తగ్గలేదన్నారు. కానీ కేంద్రం తన ఆదేశాలను ఉపసంహరించుకుందని చెప్పారు. సంపద మొత్తం ఒకరి చేతుల్లోనే ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయన్నారు.

## కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి: ఈటల



**అక్షరటుడే, హన్మకొండ:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా సర్పంచులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో బీజేపీ బలపరిచిన స్థానిక ఎన్నికల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి జరుగుతోందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా కేంద్రం నిధులతోనే నిర్మిస్తున్నారని చెప్పారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడానికి కూడా రాష్ట్రం దగ్గర డబ్బులు లేవని ఈటల రాజేందర్ అన్నారు.

## రాష్ట్రంలో పెరిగిన చలితీవ్రత



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ చలి పెరిగింది. శుక్రవారం రాత్రి నుంచి కోల్డ్ వేవ్ ప్రారంభం అయింది. కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ఏజెన్సీ గ్రామాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.1 డిగ్రీల కనిష్ణ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో చలి పెరిగింది. హైదరాబాద్ నగరంలో సైతం ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాజేంద్రనగర్‌లో శనివారం ఉదయం 12.3 డిగ్రీల టెంపరేచర్ రికార్డయ్యింది. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

## అయ్యప్ప భక్తుల ఆందోళన..

**అక్షరటుడే, మేడ్చల్:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలోని నారపల్లి నల్లమల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. శనివారం పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు కాలేజీ వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. అయ్యప్ప మాల వేసుకున్న ఓ విద్యార్థిని కాలేజీ సిబ్బంది అవమానించారని భక్తుల ఆందోళన చేపట్టారు. మాల వేసుకుని కాలేజీకి వచ్చిన స్టూడెంట్‌తో యాజమాన్యం బలవంతంగా యూనిఫాం వేయించింది. ఈ ఘటనపై ఏబీవీపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాలేజీ యాజమాన్యం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్ – రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. గత 7080 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసిందని.. కానీ, భారత్ – రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు.

## అమెరికాలో అగ్నిప్రమాదం.. హైదరాబాద్ యువతి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్:** అమెరికాలో జరిగిన అగ్ని ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ యువతి ఉడుముల సహజారెడ్డి (24) అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తోంది. కాగా.. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి అల్బనీ ప్రాంతంలోని ఓ అపార్ట్ మెంట్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని సహజారెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మరణ వార్తను జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్న తల్లిదండ్రులకు అధికారులు తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు..



**అక్షరటుడే, హైదరాబాద్:** భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ వేడుకలకు హాజరు కానున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజులపాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ–సెమీకండక్టర్లు, హెల్త్, ఎడ్యుకేషన్, టూరిజం, పరిశ్రమలు, గిగ్ ఎకానమీ, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, సామాజిక సంక్షేమం వంటి రంగాలపై చర్చించనున్నారు.